పర్యాటక కేంద్రంగా పద్మనాభుని క్షేత్రం



శిఖరం పునర్నిర్మాణంపై దేవాదాయ శాఖ ఇంజినీరింగ్ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పద్మనాభం: పద్మనాభంలోని అనంత పద్మనాభ స్వామి గిరి, గిరిపై ఉన్న అనంత పద్మనాభ స్వామి క్షేత్రాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దుతామని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. పద్మనాభంలో అనంత పద్మనాభస్వామి గిరిపైకి పంచాయతీ రాజ్ నిధులు రూ.5 కోట్లతో ఘాట్ రోడ్డు నిర్మాణానికి, గిరిపై అనంతుని శిఖరం పునర్నిర్మాణానికి కామన్ గుడ్ ఫండ్స్ నిధులు రూ.60లక్షలతో శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతూ దేశంలో రెండోది గాను, ఆంధ్ర ప్రదేశ్‌లో ఏకైక క్షేత్రంగా అనంత పద్మనాభ స్వామి భాసిల్లుతోందన్నారు. కార్తీక మాసంలో అనంత పద్మనాభుని దీపోత్సవానికి పది లక్షల పైగా భక్తులు తరలి వస్తారని చెప్పారు. శిఖరం పునర్నిర్మాణం ప్లాన్ పరిశీలించి త్వరిత గతిన పనులు పూర్తి చేయాలని దేవాదాయ శాఖ ఇంజినీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చక స్వాములు ఎమ్మెల్యేకు స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పి.సీతా రామాంజనేయ స్వామి అనంత పద్మనాభస్వామి విశిష్టతను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, సర్పంచ్ తాలాడ పాప, ఈవో నానాజీ బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు సిరుగుడి ఆదినారాయణ, తాలాడ పద్మనాభం, బుగత సత్యనారాయణ, జీవీకేకే వర్మ, బి.వి.ఎస్.ఎన్.రాజు, మొకర అప్పలనాయుడు, గాడు అప్పలరాజు, సుంకర నారాయణరావు, మామిడి శివ రామ కృష్ణ, బోని సన్యాసినాయుడు, తాలాడ నరిసింహనాయుడు, కోరాడ రామేశ్వరరావు పాల్గొన్నారు.

'ఆరోగ్యశ్రీ'తో పేదలకు భరోసా



పద్మనాభంలో ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పద్మనాభం: ఆరోగ్య శ్రీ వల్ల పేదల ప్రాణాలు నిలుస్తున్నాయని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. పద్మనాభం గ్రామంలో శుక్రవారం ఆయన 8465 మందికి ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వైఎస్సార్ ఆరోగ్యశ్రీని ప్రవేశపెట్టారన్నారు. పేదల ప్రాణాలను కాపాడేందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన రెడ్డి ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.25లక్షల వరకు పెంచారన్నారు. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ సీఎం అయితేనే పథకాలన్నీ కొనసాగుతాయన్నారు. నాలుగు హైవేలను కలుపుకుని ఉన్న పద్మనాభం మండలానికి మహర్దశ పట్టనుందన్నారు. భూములు విలువ మరింత పెరుగుతాయన్నారు.కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, సర్పంచ్ తాలాడ పాప, వైఎస్సార్ సీపీ నాయకుడు తాలాడ పద్మనాభం, తాలాడ పైడిరాజు, తాలాడ నరిసింహనాయుడు, చందక శ్రీను, రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారిణి స్వప్న, ఎంపీహెచ్ఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలను తీసుకుని వస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రాలను, అభిషేక సామగ్రిను ప్రదక్షణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకుని వెళ్లి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

'ఆరోగ్యశ్రీ' కార్డుల పంపిణీ



ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ చేస్తున్న శ్రీనివాస్

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు మల్ల్యయ్యపాలెంలో శుక్రవారం 625 ఆరోగ్యశ్రీ కార్డులను వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షులు పోతిన శ్రీనివాస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగేశ్వరరావు, కుడిత రామారావు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఎనిమిది మంది జూదరుల అరెస్టు

పద్మనాభం: మండలంలోని అనంతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెనుక శుక్రవారం పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసి వీరి నుంచి రూ.9,250 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ జె.సురేష్ తెలిపారు. అనంతవరంలో పేకాట ఆడుతున్నట్టు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసినట్లు ఎస్ఐ తెలిపారు. తొమ్మిది సెల్ ఫోన్లు, ఒక కారు, మూడు మోటార్ బైక్‌లు సీజ్ చేసినట్టు తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



నోట్ బుక్కుతో విద్యార్థులు

పద్మనాభం: పద్మనాభం పంచాయతీ ఇసకల పాలెం ప్రాథమిక పాఠశాల 23 మంది విద్యార్థులకు దాతలు పోలింట్ బ్రదర్స్, తాటిపూడి చిట్టి బాబు శుక్రవారం సామగ్రి వితరణగా ఇచ్చారు. డబుల్, ఫోర్ రూల్ పుస్తకాలు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మేనేజర్ శివకుమార్ వాటర్ బాటిళ్లు అందజేశారు.

90 రోజుల్లోనే ఫామ్ హౌస్ నిర్మాణం



మాట్లాడుతున్న నైటిక్ లకానీ

కొమ్మాది: 90 రోజుల్లోనే వైజాగ్ నగరంలో అవుట్ హౌస్ లేదా ఫామ్ హౌస్‌ను నిర్మించి ఇస్తామని మోడుకో సంస్థ సీఈవో నైటిక్ లకానీ తెలిపారు. శుక్రవారం సాగర్‌నగర్ ఓ స్టూడియోలో ఓపెన్ హౌస్ ఇన్‌స్టా విల్లాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడుకో-400 మాడ్యులర్ విల్లాలను వైజాగ్‌లో నిర్మించడానికి హోటల్ కంపెనీలు, బిల్డర్స్‌తో కలసి పనిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

చిత్తడి నేలలను పరిరక్షించుకోవాలి



మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపాల్ సుధాకర్

భీమునిపట్నం: తడితో కూడుకున్న చిత్తడి నేలలవల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వాటిని పరిరక్షించుకోవలసిన బాధ్యత అందరిపైనా ఉందని భీమిలిలోని జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ అన్నారు. ప్రపంచ చిత్తడి నేలల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. సముద్రాలు, చెరువులు, నదుల పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా ఈ చిత్తడి నేలలు ఉంటాయని ఇది పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో ఉపయోగపడే నేస్తాలని అన్నారు. ఈ ప్రాంతాల్లో ఎక్కువగా ప్లాస్టిక్‌తోపాటు ఇతర వ్యర్థాలు పడేయడంద్వారా అవి అంతరించిపోతున్నాయన్నారు. వైస్ ప్రిన్సిపాల్ గొట్టేటి రవి, అధ్యాపకులు మాధవి, మహాలక్ష్మి, హరిణి పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



తునివలస ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఆపస్ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నేతలు

పద్మనాభం: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు అవనాపు అరుణ్ కుమార్ అన్నారు. మండలంలోని తునివలస ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ పోస్టులను అప్రెంటిస్ పద్ధతిలో కాకుండా పూర్వం లాగా నియామకాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏపీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బంగారు అప్పలరాజు, మండల శాఖ అధ్యక్షుడు కంటుబోతు మురళీ, ఉపాధ్యక్షుడు ఆల్తి శ్రీనివాస్, ఆసపు ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎంజే శంకరనారాయణరావు, కోశాధికారి కనకల సన్యాసినాయుడు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో భువనేశ్వరి ప్రతిభ



భువనేశ్వరిని అభినందిస్తున్న అనిల్ నీరుకొండ మెడికల్ కళాశాల ప్రతినిధులు

తగరపువలస: గత నెల 9 నుంచి 12 వరకు రాజస్థాన్‌లోని ఝుంఝునుకు చెందిన శ్రీజగదీష్ ప్రసాద్ జబర్మాల్ టిబర్‌వాలా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన అంతర విశ్వవిద్యాలయాల తైక్వాండో పోటీలలో సంగివలస అనిల్ నీరుకొండ దంతవైద్య కళాశాల విద్యార్థిని ఎల్.టి.భువనేశ్వరి కాంస్య పతకం సాధించింది. ఈమె డాక్టర్ వైఎస్సార్ హెల్త్ విశ్వవిద్యాలయం తరపున ఈ పోటీలలో పాల్గొంది. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో భువనేశ్వరిని డీన్ డాక్టర్ సుధాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ వంశీకృష్ణారెడ్డి వైస్ ప్రిన్సి పాల్ డాక్టర్ శ్రీధర్, ఏవో శివప్రసాద్ అభినందించా రు.

వెలగని వీధి లైట్లు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు రెడ్డి సంతపేటలో రెండు రోజులుగా వీధిదీపాలు వెలగడం లేదు. దీంతో ఈ ప్రాంతంలోని అంధకారం అలుముకోవడంతో వీధి కుక్కలు స్థానికులపై దాడు లు చేస్తున్నాయి. తక్షణం వీధి లైట్లు వెలిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సింహాచలంకు ఘన సత్కారం



పదవీ విరమణ చేసిన ఏఈఓ సింహాచలంను సన్మానిస్తున్న నాయకులు, అధికారులు

ఆనందపురం : ప్రజల అభిమానం చూరగొన్న వారే ఉత్తమ ఉద్యోగులని జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు చెప్పారు. వ్యవసాయ విస్తరణాధికారిగా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన రంభ సింహాచలంను మండలంలోని పెద్దిపాలెంలో శుక్రవారం జరిగిన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో సింహాచలం అందించిన సేవలు రైతులకు ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు. వైఎస్సార్‌సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు మాట్లాడుతూ ఉద్యోగులు తమ బాధ్యతలను గుర్తెరిగి పనిచేసిన నాడే సమాజానికి న్యాయం చేసిన వారవుతారని సింహాచలం అందుకు ఉదాహరణ అని అన్నారు. కార్యక్రమంలో భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, జిల్లా వ్యవసాయాధికారి కె.అప్పలస్వామి, జిల్లా ఉద్యానవనాల శాఖాధికారి మన్మథరావు, జిల్లా వ్యవసాయాధికారుల సంఘం అధ్యక్షురాలు మాణిక్యాంబ, భీమిలి ఏడీఏ విజయ్ ప్రసాద్, రాష్ట్ర ఏఈఓ సంఘం కార్యదర్శి కేవీ సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు సంజీవరావు, నాయకులు లొడగల రమణ, నాగోతు శ్రీను, రౌతు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతుల్లో బోధన అవసరం



శిక్షణపై ఆరా తీస్తున్న డీఈవో చంద్రకళ

మధురవాడ: విద్యార్థులను మరింత తీర్చిదిద్దేందుకు ఆధునిక పద్ధతుల్లో విద్యా బోధన చేయాల్సి అవసరం ఉందని డీఈవో ఎల్. చంద్రకళ చెప్పారు. శుక్రవారం చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లాలోని ఉపాధ్యాయులకు సైన్స్ అండ్ మేథ్స్ సైమలేషన్ సాఫ్ట్‌వేర్‌పై ఇస్తున్న శిక్షణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృత్తి నైపుణ్యాలును అభివృద్ధి చేయడం కోసం జిల్లాలో చంద్రంపాలెంతో పాటు కేడీపీఎమ్ పాఠశాల, నడుపూరులలో శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. మూడు రోజులు పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. శుక్రవారం లెక్కలు, శని, సోమవారాల్లో ఫిజికల్ సైన్స్, 5వ తేదీన బయాలజీ సబ్జెక్టులో శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. మొదటి రోజు శిక్షణను ఆమె పరిశీలించారు.

సందడే సందడి

భారీగా తరలివచ్చిన క్రికెట్ అభిమానులు



క్రికెట్ స్టేడియం వద్ద బారులుదీరిన క్రికెట్ వీక్షకులు

పీఎంపాలెం: వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో శుక్రవారం భారత్-ఇంగ్లాండ్ జట్ల మధ్య జరిగే రెండో టెస్ట్ మ్యాచ్‌కు విశేష స్పందన లభించింది. తమ అభిమాన క్రికెటర్లను, ఆటను ప్రత్యక్షంగా వీక్షించడానికి వచ్చిన అభిమానులతో స్టేడియం కిక్కిరిసిపోయింది. మునుపెన్నడూ రానంతగా విదేశీ క్రీడా అభిమానులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. స్టేడియం ప్రవేశ గేట్ల వద్ద క్రికెట్ అభిమానులు బారులుదీరారు. స్టేడియం బయట నగర పోలీస్ కమిషనర్ పర్యవేక్షణలో పలువురు ఏడీసీపీలు, డీసీపీలు సీఐలు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పోటెత్తిన విద్యార్థులు

మ్యాచ్‌ను వీక్షించేందుకు 2 వేల మందికి పైగా విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పిస్తామని చెప్పినప్పటికీ వివిధ పాఠశాలల విద్యార్థులు భారీగా తరలివచ్చారు. విద్యార్థులను ఆసక్తిని గమనించిన ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ విద్యార్థులందర్నీ అనుమతిచ్చింది. దీంతో విద్యార్థుల ఆనందానికి అవధులు లేవు. ఈమేరకు ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట ఏర్పాట్లు చేశారు. తొలిరోజు మ్యాచ్ వీక్షణకు భారీగా అభిమానులు తరలిరావడంతో సందడి నెలకుంది. విద్యార్థులు ఉత్సాహంగా మ్యాచ్ వీక్షించారు.



స్టేడియం వద్ద అభిమానుల కోలాహం



విద్యార్థులసందడి



పోలీసు అధికారులతో చర్చిస్తున్న ఏసీసీ వీడీసీఏ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి

ఆనందపురం తహసీల్దారుగా హేమంత్ కుమార్



ఆనందపురం : ఆనందపురం తహసీల్దారుగా జి.హేమంత్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న లోకవరపు రామారావు శ్రీకాకుళం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో హేమంత్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు.

నాయీ బ్రాహ్మణ కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న దాతలు

తగరపువలస: ఇటీవల చిట్టివలస సప్తగిరి థియేటర్ ప్రాంతానికి చెందిన నాయీ బ్రాహ్మణుడు ఎర్రిబాబు మృతి చెందడంతో ఆయన కుటుంబానికి ఫ్రెండ్స్ ఫౌండేషన్ సాయం అందించింది. శుక్రవారం ఎర్రిబాబు భార్యకు బియ్యం ప్యాకెట్, రూ.2వేలు అందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు వబ్బిలిరెడ్డి ప్రసాద్, చార్లెస్, రంగూరి గిరి, ముని రమేష్, చింతగుంట శివ, బందారు నానాజీ తదితరులు పాల్గొన్నారు.

బోరు ఏర్పాటు

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ చిరత గూడెం కళ్లాల్లో మహంతి అప్పలరమణ సొంత నిధులు రూ.1లక్షలతో బోరు బావి ఏర్పాటు చేశారు. ఈ బోరు బావి నిర్మాణానికి తాటిపూడి చంద్రయ్యమ్మ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పల్లి మహేష్, కొనర అప్పలనాయుడు, పిన్నింటి వెంకటరావు, బొబ్బిలి సంతోష్, బార్నాల సత్య శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మార్గదర్శకులుగా పూర్వ విద్యార్థులు



లవన్‌కుమార్‌ని అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చదువుకుని ఉన్నత స్థానాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు నేటి తరానికి మార్గదర్శకులుగా నిలవాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా సేవలందిస్తున్న లవన్‌కుమార్ వీసీని కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఏయూ పూర్వ విద్యార్థులు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో అత్యున్నత స్థానాల్లో స్థిరపడడం తమకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందన్నారు. ఈ సందర్భంగా లవన్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో న్యాయ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో లవన్‌కుమార్ పాల్గొన్నారు. పోటీ పరీక్షలను సన్నద్ధం కావడం, యూపీఎస్సీ పరీక్షలకు సన్నాహం, న్యాయ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు అంశంపై ఆయన అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో న్యాయ విద్యార్థులకు లభించే ఉద్యోగ అవకాశాలను వివరించారు. తాను ఇక్కడ విద్యార్థిగా చదువుకుని నేడు కేంద్ర ప్రభుత్వ సర్వీసులో పని చేస్తున్న విధానం, దీనికి తాను పడ్డ శ్రమ, కష్టాన్ని విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల చక్కని ప్రణాళికతో పరీక్షలను సిద్ధమవుతూ ఉద్యోగాలను సాధించాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతా మాణిక్యం, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఇ.శంకరరావు, వగీర, ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

సివిల్ ఇంజినీరింగ్‌లో ప్రసన్నకుమార్‌కు డాక్టరేట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థి గేదెల ప్రసన్నకుమార్‌కు డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యుడు కె.రాజశేఖర్ పర్యవేక్షణలో కాంక్రీటు ఉత్పత్తిలో సిమెంట్‌కి ప్రత్యామ్నాయంగా రెండు రకాల కొల్లాయిడల్ నానో సిలికాను వినియోగించడంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ వచ్చింది. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను ప్రసన్నకుమార్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను విభాగాధిపతి ఆచార్య సి.ఎస్.వి.సత్యనారాయణరెడ్డి, తదితరులు అభినందించారు.

రేపు ఆయుర్వేద వైద్య శిబిరం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రంలో ఆదివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు కేంద్రం గౌరవ సంచాలకుడు ఆచార్య భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు యోగా విభాగంలో ఉచిత ఆరోగ్య శిబిరంలో అన్ని రకాల వ్యాధులకు చికిత్సలు అందిస్తామన్నారు. కేజీహెచ్ విశ్రాంత సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.ఈశ్వరరావు రోగులను పరీక్షించి తగిన చికిత్స విధానాలు సూచిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు తమ వ్యాధికి సంబంధించిన రిపోర్టులతో నేరుగా హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు 94401 91673 నంబరులో సంప్రదించాలని కోరారు.

6న ఏయూలో నిక్ స్ఫూర్తిదాయక ప్రసంగం

ఏయూ క్యాంపస్: ప్రపంచాన్ని తమ స్ఫూర్తిదాయక ప్రసంగాలతో ఆకట్టుకుంటున్న ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ నిక్ ఈ నెల 6న ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సందర్శించనున్నారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో యువతను ఉద్దేశించి స్ఫూర్తిదాయక ప్రసంగం చేయనున్నారు. చిన్నతనంలో చేతులు, కాళ్లు లేకుండా జన్మించిన నిక్.. తన తల్లిదండ్రులు అందించిన ప్రోత్సాహంతో ఒక్కోమెట్టు ఎక్కారు. తన జన్మకు ఒక లక్ష్యం ఉందని నిర్ణయించుకుని దానిని చేరుకునే ప్రయత్నం చేశారు. ఈ మార్గంలో ఎన్నో అవరోధాలు, అవమానాలు ఎదురైనా నిక్ చలించలేదు. యువతకు స్ఫూర్తిని అందిస్తూ మోటివేషనల్ స్పీకర్‌గా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందారని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తెలిపారు. నిక్ ప్రసంగాన్ని ప్రత్యక్షంగా వీక్షించడానికి యువతకు అవకాశం కల్పిస్తామన్నారు.

టూరిజం ఫెయిర్ ప్రారంభం

బీచ్ రోడ్డు: దేశ వ్యాప్తంగా ఉన్న పర్యాటక ప్రదేశాలను అనుసంధానం చేసేందుకు టూరిజం ఫెయిర్‌ను దేశంలోని అనేక నగరాల్లో నిర్వహిస్తున్నట్టు టీటీఏఏ ప్రెసిడెంట్ కె.విజయ్‌మోహన్ తెలిపారు. మూడు రోజుల పాటు జరగనున్న టూరిజం ఫెయిర్‌ను శుక్రవారం హోటల్ గేట్ వేలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఫెయిర్ ప్రయాణ, వాణిజ్య కార్యకలాపాలను మరింత మెరుగుపరచడానికి ఉపయోగపడుతుందన్నారు.

ఇగ్నో ప్రవేశాలకు గడువు పొడిగింపు

ఎంవీపీ కాలనీ: ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) 2024 విద్యా సంవత్సరం ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తు గడువును పొడిగించింది. ఈ మేరకు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం ఓ ప్రకటన విడుదల చేసింది. ఇగ్నో ద్వారా అందిస్తున్న డిగ్రీ, పీజీ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ ప్రవేశాలు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరగనున్నాయి. కేంద్రం పరిధిలోని 11 జిల్లాల విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. https:// ignouadmission. samarth. edu. in/ వెబ్‌సైట్ ద్వారా అర్హులైన విద్యార్థులు ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే గతంలో ప్రకటించిన గడువు జనవరి 31తో ముగిసింది. విద్యార్థుల సౌకర్యార్థం ఇగ్నో దరఖాస్తు గడువును ఈ నెల 15 వరకు పొడిగించింది. పూర్తి వివరాలకు ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించవచ్చు.